సాక్షి
ప్రకాశం
సోమవారం | 30 | జనవరి | 2023



కడసరి కల్లోలం

సముద్రస్నానం చేస్తుండగా అలల తాకిడి ఒకరు మృతి చెందగా..మరొకరు గల్లంతయ్యారు. ఈ సంఘటన సింగరాయకొండ మండలం పాకల తీరం వద్ద ఆదివారం జరిగింది. - 8లో..



పోలీస్‌స్టేషన్ వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

తన ఇంటిని కూల్చేశారని న్యాయం చేయాలని కోరుతూ మార్కాపురం పోలీస్‌స్టేషన్ వద్ద మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31 /19

గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు జగనన్న చేదోడు మూడో విడత నగదు జమ

ఒంగోలు: జగనన్న చేదోడు పథకం మూడో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఉదయం 11 గంటలకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో 1771 మంది నాయీబ్రాహ్మణులు, 2949 మంది రజకులు, 9807 మంది టైలర్లకు నిధులు జమ కానున్నాయి. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం 14527 మందికి రూ.14.52 కోట్లు జమ కానున్నాయి.

మతిస్థిమితం లేని బాలికపై అఘాయిత్యం

- తినుబండారాల ఆశచూపి రోజు ఇంటికి వచ్చి లైంగిక దాడి
- పోక్సో చట్టం కింద కేసు నమోదు

టంగుటూరు: మతిస్థిమితం లేని 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన టంగుటూరు మండలం ఆలకూరపాడు పుల్లారెడ్డి పాలెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం..పుల్లారెడ్డిపాలెంలో మతిస్థిమితం లేని బాలికపై కన్నేసిన నిందితుడు తినుబండారాలు ఆశ చూపి లోబర్చుకున్నాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయాల్లో వచ్చి బాలికపై లైంగిక దాడికి పాల్పడేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బాలిక తల్లి ఇంటికి వచ్చేసరికి నిందితుడు బాలిక వద్ద ఉన్నాడు. పట్టుకోపోయేసరికి అక్కడ నుంచి పారిపోయాడు. తల్లి బాలికను ప్రశ్నించగా చాలా కాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్న విషయాన్ని తెలియజేసింది. దీంతో బాలిక తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై ఖాదర్‌బాషా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. దిశ డీఎస్పీ పల్లపురాజు పుల్లారెడ్డిపాలెంలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని దిశ డీఎస్పీ తెలిపారు.

సమగ్ర పంటల విధానం పరిశీలన

- రైతాంగానికి ఇబ్బంది రానివ్వం
- కలెక్టర్ దంపతుల హామీ



పొగాకు బ్యారన్ పరిశీలిస్తున్న కలెక్టర్ దంపతులు


నాగులుప్పలపాడు: సమగ్ర పంటల సాగు ఆదివారం ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు దినేష్ కుమార్, విజయకృష్ణన్ పరిశీలించారు. నాగులుప్పలపాడులోని 216 జాతీయ రహదారి పక్కనే బడ్డీ కొట్టు వద్ద టీ తాగిన అనంతరం పక్కనే ఉన్న పొగాకు బ్యారన్‌ల సాగు, ఆకు రెల్లడం, అల్లకం వంటి విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులతో క్యూరింగ్, గ్రేడింగ్ విధానాలతో పాటు దిగుబడి అంశాలపై చర్చించారు. అలాగే మిరప, శనగ పంటల్లో వచ్చిన తెగుళ్లపై రైతాంగం కలెక్టర్ల దృష్టికి తీసుకురాగా.. వ్యవసాయ శాఖతో చర్చించి ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గుండ్లకమ్మ నది నుంచి పంటలకు నీటి లభ్యతపై మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో చివరి పంట వరకు నీటికి ఇబ్బంది లేకుండా అధికారులను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.

సహజ నటిగా జమున కీర్తి శాశ్వతం



జమున చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కవులు,కళాకారులు

ఒంగోలు టౌన్: అపురూపమైన అందం, అద్భుతమైన అభినయంతో నవరసాలను అవలీలగా పోషించిన మహానటి జమున సత్యభామగా నటించి తెలుగు చిత్రసీమలో శాశ్వత కీర్తి పొందారని శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్‌బాబు కొనియాడారు. నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీవీఎన్ రీడింగ్ రూం అండ్ క్లబ్ ఆవరణలో జమున సంస్మరణ సభ నిర్వహించారు. సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా రాణించి ప్రజల మన్ననలను పొందారని మెమోరియల్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు అన్నారు. జమున చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానాచార్యులు అయినంపూడి నరసింహారావు, విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ దేవరశెట్టి సింగయ్య, కనుమల రాఘవులు, నాటకరంగ ప్రతినిధులు ఏ.ప్రసాద్, జాలాది మోహన్, కొప్పోలు వెంకటేశ్వర్లు, చిడితోడి బాబురావు, జి.సత్యనారాయణ,షేక్ అజీజ్ పాల్గొన్నారు.



ఖరీఫ్‌లో వరి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో అధిక దిగుబడులు రావడంతో పాటు మద్దతు ధర కూడా లభిస్తుండడంతో అన్నదాత ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. గతేడాది ప్రకృతి విపత్తులు, తెగుళ్లతో రైతులు నష్టాలపాలయ్యారు. ఈ దఫా కాలం కలిసి వచ్చింది. దళారులు, మిల్లర్ల ప్రమేయం లేకుండా నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఖరీఫ్‌లో వరి సాగు 82,250 ఎకరాలు

ధాన్యం కొనుగోలు లక్ష్యం 19 వేల మెట్రిక్ టన్నులు

ధాన్య సిరులు

- జోరుగా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు
- అధిక దిగుబడి, ప్రభుత్వ అండతో ఆనందం
- ఏ గ్రేడ్ ధాన్యం ధర రూ.2,060, సాధారణ రకం ధర రూ.2,040
- 744 టన్నుల సేకరణ, రూ.1.53 కోట్ల చెల్లింపు



దర్శి-అద్దంకి రోడ్‌లో ఆరబోసిన ధాన్యం

దర్శి టౌన్: ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకునే సమయంలో రైతులు దోపిడీలకు గురయ్యేవారు. మిల్లర్లు, దళారులు డిమాండ్ లేదని, నాణ్యత లేదని కుంటిసాకులు చెబుతూ మద్దతు ధర ఇవ్వకుండా అన్నదాతలను దగా చేసే వారు. వీటికి చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా మద్దతు ధరకే నేరుగా ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోంది. గోతాల దగ్గర నుంచి రవాణా వారకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 82,250 ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 32.90 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు అంచనా. ప్రభుత్వం దాదాపు 19 లక్షల టన్నులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది కన్నా అదనంగా నేడు కాటా, బస్తాలు, రవాణా సైతం ప్రభుత్వమే అందిస్తోంది. దళారులు సైతం ఇదే బాటలో నడవడంతో రైతన్నలు పండించిన పంటకు డిమాండ్ ఏర్పడింది. ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజులకు నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు సుమారు 744 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1.53 కోట్లు రైతులకు చెల్లించింది.

టీడీపీ హయాంలో దగా

టీడీపీ హయాంలో పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు)ల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేది. పేరుకే కొనుగోలు కేంద్రాలు. రైతులకు ఎప్పుడు మద్దతు ధర అందేది కాదు. తేమ శాతం, పొల్లు గింజ అంటూ 75 కేజీల బస్తాకు రూ.200 తగ్గించేవారు. రవాణా, పట్టుబడి చార్జీలు అంటూ మరి కొంత వసూలు చేసే వారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లలేని సన్న, చిన్న కారు రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. బస్తాకు రూ.150 నుంచి రూ.200 వరకు నష్టపోయేవారు. ఒక ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు దిడుబడి వస్తే రైతులకు నాలుగు నుంచి ఆరు వేల రూపాయల వరకు నష్టపోయే వారు. రైతుల పేరుతో బినామీగా తెలుగు తమ్ముళ్లు అమ్ముకుని కోట్లాది రూపాయలు ఆర్జించారు.

ఎప్పటికప్పుడు ప్రతిబంధకాలు అధిగమించి..

మద్దతు ధరకు ఎదురవుతున్న ప్రతి బంధకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అధిగమించి రైతులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తోంది. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో నిబంధనల్లో మార్పులు తీసుకువచ్చారు. మిల్లర్లు, కమిషన్ వ్యాపారుల ప్రమేయం లేకుండా నేరుగా మద్దతు ధర అందించాలన్న లక్ష్యంతో కొనుగోలు విధానాన్ని ప్రక్షాళన చేశారు. ఆర్‌బీకేలను కొనుగోలు కేంద్రాలుగా మార్చారు. వ్యవసాయ, సహకారశాఖల సమన్వయంతో మద్దతు ధర అందించడంలో విజయవంతమయ్యారు. మునుపెన్నడూ లేని రీతిలో ధాన్యం పట్టుబడికి కూలీల చార్జీలు సైతం అందేలా చేశారు.100 కేజీల బస్తాను ఆర్‌బీకేల్లో గ్రేడ్ ఏ-రకం రూ.2,060, సాధారణ రకం రూ.2,040 కొనుగోలు చేస్తున్నారు. క్వింటా రూ. 25 కూలీ, గోతాలు ప్రభుత్వం అందిస్తోంది. 75 కేజీల సాధారణ రకం రూ.1,530, గ్రేడ్-ఏ రూ.1,545 కొనుగోలు చేస్తున్నారు. తాలు గింజలు ఉంటే ఒక రోజు ఎండ బెట్టి మళ్లీ ఆరబోస్తే మద్దతు ధర లభిస్తోంది. ఇదిలా ఉండగా 51 ఆర్‌బీకేల ద్వారా 19 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సివిల్ సప్లయిస్ అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు 13 కేంద్రాల ద్వారా 744 టన్నుల ధాన్యం సేకరించారు.



కళంలో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

బయట మార్కెట్లోనూ పెరిగిన డిమాండ్

ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుండడంతో సాధారణ, ప్రైవేట్ వ్యాపారులు కూడా రైతులకు మంచి ధరే ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. సాధారణ రకాన్ని 75 కేజీల బస్తాను రూ.1,550, రూ.1,560 వరకు ధర పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కూలీ, గోతాలకు అదనంగా రైతులు చెల్లించాల్సి వస్తుండడంతో రైతులు ఆర్‌బీకేల వద్దనే విక్రయానికి మొగ్గు చూపుతున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు



రైతులు ఆర్‌బీకేల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలి. దళారులు, కమీషన్ వ్యాపారులను ఆశ్రయించొద్దు. ప్రస్తుతం కొనుగోళ్లు కొనసాగుతాయి. 13 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. కొన్ని మండలాల్లో పంట ఇంకా చేతికి రాలేదు. క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ల కేంద్రాలను సందర్శించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు లబ్ధి చేకూరేలా చార్జీలు, గోతాలు సైతం అందిస్తున్నాం.

– పి.గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్, సివిల్ సప్లయిస్ డీఎం

మంచి డిమాండ్ ఉంది



వరికి ఈ ఏడాది మంచి డిమాండ్ వచ్చింది. 3 ఎకరాల్లో సాగు చేస్తే దిగుబడి బాగా వచ్చింది. కల్లాలోనే అధికారులు కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వడం సంతోషంగా ఉంది.

– సుబ్బారాయుడు, రైతు, లక్కవరం

ప్రైవేట్ వ్యాపారుల వద్దా మంచి ధర



ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటంతో ప్రైవేట్ వ్యాపారులూ కూడా మంచి ధరకు కొనుగోలు చేస్తున్నారు. గతంలో ధాన్యం అమ్మి నగదు కోసం మూడు నెలల వరకు ఎదురుచూడాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. దిగుబడులు కూడా బాగా రావడంతో కలిసి వచ్చింది.

– క్రిష్టారెడ్డి, రైతు, రెడ్డినగర్

యాదవుల అభ్యున్నతికి సీఎం ప్రత్యేక కృషి

- యాదవులంతా సీఎంకు రుణపడి ఉంటారు
- సీఎంను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వరరావు

మార్కాపురం: రాష్ట్రంలో యాదవుల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేశారని, ఇంకా చేస్తున్నారని యాదవులంతా రుణపడి ఉంటారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో యాదవ క్రమశిక్షణ సంఘం జాతీయ కమిటీ చైర్మన్ పీఎల్‌పీ యాదవ్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన యాదవ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 136 బీసీ కులాలు ఉండగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వీరి అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. తిరుమలలో స్వామి వారి తలుపులు తీసే సంప్రదాయాన్ని యాదవులైన సన్నిధి గొల్లలకు కొనసాగించిన ఘనతతో పాటు గొల్లమండపాన్ని కూడా అక్కడే ఉంచేలా సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. బీసీల అభివృద్ధికి గతంలో ఏ సీఎం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్నారన్నారు.

లోకేష్ పాదయాత్ర నుంచి అన్ని అపశకునాలే..

యువగళం పేరుతో నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించిన రోజు నుంచి అన్ని అపశకునాలే రాష్ట్రంలో జరుగుతున్నాయన్నారు. పాదయాత్ర రోజున సీనియర్ నటి జమున చనిపోయారని, పాదయాత్రలో పాల్గొన్న నటుడు తారకరత్న గుండెపోటుతో చావుబతుకుల మధ్య ఉన్నారన్నారు. యువగళం పేరుతో రాష్ట్రంలో యువతను మోసం చేసేందుకు పాదయాత్ర చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవని కొడుకును చంద్రబాబు మంత్రిగా చేశాడన్నారు. టీడీపీ హయాంలో బీసీలను ఎంత చిన్నచూపు చూశారో మరిచిపోయిన లోకేష్..బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా కూడా గెలవలేని లోకేష్ సీఎం జగన్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్ ఎంత పాదయాత్ర చేస్తే వైఎస్సార్ సీపీకి అంత ఉపయోగమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజల కష్టాలను దగ్గరగా చూసి వాటిని మ్యానిఫెస్టోగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. మంత్రి నాగేశ్వరరావు బొల్లావును ఎత్తుకుని సభా ప్రాంగణానికి వచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాదవ ప్రముఖులు భారీగా హాజరయ్యారు. సినినటి కరాటే కళ్యాణి, గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల సుబ్బయ్య, కొనకనమిట్ల ఎంపీపీ మురళి కృష్ణా యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల పిచ్చయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ వై.నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు పటాపంజుల అశోక్‌కుమార్, పిన్నిక మధుసుదన్, మెట్లా చెంచయ్య, పిన్నిక చక్రపాణి, మాజీ జెట్పీటీసీ గంగరాజు, నాగం కృష్ణా, న్యాయవాదులు విద్యా, ఉమామహేశ్వరి, మాజీ ఎంపీపీ వెంకటరాజు, గురుప్రసాద్, పోలయ్య, నాలి కొండయ్య, బుర్రి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీఎల్‌పీ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు.



బొల్లావును ఎత్తుకున్న మంత్రి నాగేశ్వరరావు

సంక్షేమమే ఊపిరిగా..



31వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు

- ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు
- ఒంగోలు నగరంలోని ప్రతి డివిజన్‌లో రూ.కోటికి పైగా అభివృద్ధి పనులు
- 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ఊపిరిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని 31వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావుతో కలిసి ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ, భాగ్యనగర్‌లోని కృష్ణా మెమోరియల్ స్కూలు పరిసరాల్లో బాలినేని వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల్లో ఎంతమేర కోత పెడదామా అన్న ఆలోచన తప్ప అర్హులను ఆదుకుందామన్న ఆలోచనే ఉండేది కాదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుకు భిన్నంగా అర్హత ఉంటే చాలు పథకం దక్కాల్సిందే అన్నట్లుగా పరిపాలన సాగుతోందని వెల్లడించారు. ఒంగోలు నగరంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ప్రతి డివిజన్‌లో కనీసం అంటే రూ.కోటికి తగ్గకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని డివిజన్‌లలో రూ.3 నుంచి రూ.4 కోట్ల వరకు కూడా అభివృద్ధి పనులు సాగుతున్నాయని వివరించారు. 31వ డివిజన్‌లో రూ.కోటికి పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. డివిజన్‌లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కష్టపడి పనిచేస్తున్నారని బాలినేని కొనియాడారు. డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, నాగేశ్వరరావులు ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా డివిజన్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన తీరును బాలినేని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు స్థానికులకు వివరించారు. సంక్షేమ పథకాలు వస్తున్న తీరును అడిగి ఇంకేమైనా సలహాలు ఉంటే ఇవ్వాలని ప్రజలను బాలినేని కోరుతున్నారు. కొందరు వ్యక్తిగత సమస్యలను కూడా బాలినేని దృష్టికి తీసుకువస్తుండగా..వెంటనే స్పందించి పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. డివిజన్‌లో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, ఏపీఐఐసీ కార్పొరేషన్ సభ్యులు మువ్వా స్వాతి, కార్పొరేటర్లు ఈదర చిన్నారి, జడా వెంకట్, తాడి కృష్ణలత, నాగం వెంకట శేషయ్య, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లెళ్లమూడి రమాదేవి, బొప్పరాజు జ్యోతి, గొర్రెపాటి శ్రీనివాసులు, మైనారిటీ బహబూబ్ బాష, పసుపులేటి శ్రీనివాసులు, విస్సు, మోడుబోయిన సురేష్, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, బేదపూడి రాజేశ్వరి, అక్కిరెడ్డి, గోలి తిరుపతి రావు, దేవరపల్లి అంజిరెడ్డి, నజీరు, మీరావలి, 31వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు జి.స్వరూప్, మిడసల మధుబాబు, గుంజి ఏడుకొండలు, బండారు శ్రీరాములు, కొమ్ము రవి, బండారు మల్లికార్జునరావు, విసు, బడుగు ఇందిర, కొమ్మూరి రవిచంద్ర, కొమ్ము రాజీవ్, దాసు, విజయ, కుమారు, కట్టా రాజు, రమాకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ విజేత ఉత్తరప్రదేశ్



విజేత ఉత్తరప్రదేశ్ జట్టుకు ట్రోఫీ, మెడల్స్ అందిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో పురుషుల, మహిళల విభాగాల్లో ఉత్తరప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్-పాండిచ్చేరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ని ఆసక్తిగా తిలకించారు. అనంతరం ప్రథమస్థానంలో నిలిచిన ఉత్తరప్రదేశ్ మహిళల జట్టుకు ట్రోఫీ, మెడల్స్ అందించారు. అదే విధంగా ద్వితీయ స్థానంలో నిలిచిన పాండిచ్చేరి పురుషుల జట్టు, మహారాష్ట్ర మహిళల జట్లకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ టెన్నిస్‌బాల్ క్రికెట్‌కు విశేష ప్రేక్షకాభిమానులు ఉన్నారన్నారు. మూడు రోజులపాటు జరిగిన మ్యాచ్‌లు తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజానీకం రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. సాధారణ క్రికెట్‌కు తీసిపోని విధంగా మ్యాచ్‌లు నిర్వహించారంటూ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ చిడితోటి జీవన్, ఏజె సొల్యూషన్స్ ఎండీ శాంతి ప్రియ, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, టెన్నిస్‌బాల్ క్రికెట్ జిల్లా చైర్మన్ జనార్దన్, అధ్యక్షుడు కె.శివకోటిరెడ్డి, కార్యదర్శి కె.రవి, రాష్ట్ర చైర్మన్ బాబర్, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ లోరి, కార్యదర్శి ఆర్‌డీ ప్రసాద్, ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ లతీఫ్ పాల్గొని విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ బహూకరించారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ పోటీలు



హ్యాండ్‌బాల్‌లో తలపడుతున్న జట్లు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్-17 బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు పోటీల్లో 25 బాల బాలికల జట్లు తలపడ్డాయి. పోటీల్లో 8 బాలురు జట్లు, 8 బాలికల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో నెల్లూరు, పశ్చిమగోదావరి, , విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జట్లు, బాలికల విభాగంలో విజయనగరం, కర్నూలు, గుంటూరు, చిత్తూరు, ప్రకాశం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, కడప జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఫైనల్స్ నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామని పీడీ నరసింహారావు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి సమస్య లేకుండా ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు అన్ని వసతులు కల్పించారు. పోటీలను తిలకించేందుకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి క్రీడాభిమానులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు సహకారంతో పోటీలను ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

వైన్ షాపు వద్ద వ్యక్తి మృతి


మృతి చెందిన రమణయ్య

కొమరోలు: అతిగా మద్యం సేవించడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన స్థానిక మద్యం దుకాణం వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కొమరోలులోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే మెటల్ రహదారి వద్ద ఉన్న వైన్ షాపు ఎదుట ఆదివారం మృతి చెంది పడిఉన్న వ్యక్తి మొట్టుపల్లె గ్రామానికి చెందిన కంబాల పాటి రమణయ్యగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. ఎక్కువగా మద్యం సేవించడంతో పాటు రమణయ్యకు మూర్ఛ రోగం ఉండటంతో అక్కడే మృతి చెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్యపై గొడ్డలితో దాడి


భర్త దాడిలో గాయపడిన లక్ష్మీదేవి

సీఎస్‌పురం: భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసి గాయ పరచిన సంఘటన మండలంలోని తుంగూడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై పి. అనిల్ కుమార్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవిని బేస్తవారపేట మండలం, పొగుళ్ల గ్రామానికి చెందిన దొర తిమ్మయ్యకు ఇచ్చి వివాహం చేశారు. అయితే భార్య భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో లక్ష్మీదేవి సంక్రాంతి పండగకు అమ్మగారి ఊరైన తుంగూడుకు వచ్చింది. ఆమె భర్త తిమ్మయ్య శనివారం భార్య వద్దకు వచ్చాడు. ఆదివారం మధ్యాహ్న సమయంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో మంచంపై కూర్చుని ఉన్న లక్ష్మీదేవి తలపై గొడ్డలితో కొట్టి పారిపోయాడు. ఆమె ఎడమచెవి ప్రాంతంలో తీవ్ర గాయం కాగా కింద పడి పోయింది. బంధువులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, తిరుపతయ్య, బాధితురాలికి ప్రాథమిక చికిత్స నిర్వహించి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం ఒంగోలుకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

'శివరాత్రి సేవా' ప్రాంతాల పరిశీలన


పెచ్చెరువులో సేవా కార్యక్రమాల ఏర్పాటు స్థలాలను పరిశీలిస్తున్న ఈఓ లవన్న

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పాదయాత్రగా శ్రీశైలం వచ్చే భక్తుల సౌకర్యార్థం నల్లమలలో చేపట్టబోయే సేవా కార్యక్రమాల ఏర్పాట్లను ఈఓ లవన్న ఆదివారం పరిశీలించారు. పెచ్చెరువు, తుమ్మలబైలు గుంట ప్రాంతాల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించిన స్థలాల్లో పర్యటించారు. ఫిబ్రవరి 12వ తేదీ, 17వ తేదీ వరకు భీముని కొలను వద్ద గ్లూకోస్ వాటర్ కేంద్రం, ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 20 తేదీ వరకు పెద్దదోర్నాలలోని ఇస్కాన్ సెంటర్ వద్ద 2 లక్షల మందికి ఉచిత అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి నిమయ్‌దాస్, ఈఓ లవన్నకు తెలిపారు. దాతలు సాంబశి ఇండియా లిమిటెట్ అధినేత, పరమేశ్వర్ శ్రీఎంటర్ ప్రైజెస్ అధినేత వెంకట్‌రెడ్డి, ఎంఆర్ గ్రూప్స్ అధినేత దేవా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద మహిళ ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న ఎలిజబెత్

మార్కాపురం: గత 20 ఏళ్లగా నివాసం ఉంటున్న తన ఇంటిని కూల్చివేశారని న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా పోలీస్‌లు జిల్లా వైద్యశాలకు తరలించారు. వివరాలు.. పట్టణంలోని ఏకలవ్య కాలనీలో నివాసం ఉంటున్న ఎలిజబెత్ ఇంటిపై వివాదం ఏర్పడింది. తాను నివాసం ఉంటున్న ఇంటిని కొందరు వచ్చి కూల్చివేశారని, ఆ స్థలం తనదంటూ ఆమె పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన ఇంటిని పడగొట్టి కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం పోలీస్ స్టేషన్ బయట పురుగుమందు తాగింది. దీంతో వెంటనే జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై పట్టణ ఎస్సై శశికుమార్‌ను వివరణ కోరగా ఎలిజబెత్, రమేష్‌ల వివాదంలో రెవెన్యూ అధికారులు.. ఇంటి పట్టా రమేష్‌దేనని చెప్పారన్నారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నాటు.. నాటు


పొలం గట్టు చెక్కుతున్న మహిళ


బొట్లపాడు వద్ద వరి నారు కోస్తున్న దృశ్యం


ముండ్లమూరు వద్ద పొలంలో నాట్లు వేస్తున్న మహిళలు


పాకల వద్ద కళకళలాడుతున్న పంట పొలాలు


ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు ఇంటికి..


ముండ్లమూరు వద్ద దమ్ము చేస్తున్న రైతు


తూర్పు గంగవరం వద్ద యంత్రంలో వరి కోత..


పులిపాడు వద్ద ధాన్యాన్ని తూర్పారబడుతున్న కూలీలు

● పచ్చదనం.. పరవశం

తొలకరి చినుకు పలకరిస్తే వర్షం
వెంటనే రైతుకు హర్షం
భూ దేవికి పులకరింత
పంట చేలకు భాగ్యమంట
విత్తు చేలో పడితే సంతోషం
పుష్కలంగా నీరందితే చేనుకు బలం
ఖర్చు పెట్టడం అన్నదాతకు ఇష్టం
ధాన్య రాశులు వస్తాయన్న నమ్మకం
...
కంకులన్నీ బోసి నవ్వులు విసిరాయి
కొడవలి వంక సిగ్గు పడుతూ చూశాయి
ఆకలైతే మేమున్నాముగా అన్నాయి
తూర్పార బడుతుంటే గాలులు వీచాయి
గోతాలు ఎగిరి గంతేశాయి
గాదెలు నిండాయి
అన్నదాత కళ్లు ఆనందంతో తడిశాయి...
జిల్లాలో పలు చోట్లు వరి నాట్లు ముమ్మరంగా వేస్తుండగా.. మరికొన్ని చోట్ల ధాన్యరాశులు ఇళ్లకు వస్తున్నాయి.

– సాక్షి ఒంగోలు

కడసరి కల్లోలం

- వాతావరణ మార్పులతో సముద్రంలో సంభవించిన 'కడసరి'
- అంటే సుడిగుండం తరహాలో వచ్చే అలలు
- దీని దెబ్బకు అన్నా చెల్లెళ్లు గల్లంతు
- చెల్లిని కాపాడిన మత్స్యకారులు
- రోదిస్తున్న బంధువులు
- అన్న ఆచూకీ కోసం సముద్రంలో గాలింపు


అమాద్ ఆచూకీ కోసం గాలిస్తున్న బోటు

సింగరాయకొండ: నానమ్మ, తాతయ్యలతో కలిసి సరదాగా సముద్ర తీరానికి వచ్చిన అన్నా చెల్లెళ్ల జీవితాలను అలలు అతలాకుతలం చేశాయి. వీరిద్దరూ సముద్రంలో మునిగిపోగా చెల్లిని మత్స్యకారులు కాపాడారు. అన్న ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషాద సంఘటన ఆదివారం పాకల తీరం వద్ద జరిగింది. అన్న షేక్ అబ్దుల్ అమాద్ (15), చెల్లి షేక్ అబ్దుల్ అమల్ (14)ది సోమరాజుపల్లె పంచాయతీలోని పకీరుపాలెం. ఆగ్రామంలోని మసీదులో మౌలానాగా విధులు నిర్వహిస్తున్న వీరి తండ్రి షేక్ అబ్దుల్ అమీద్ సిద్దిక్ నూతన గృహం నిర్మించుకున్నాడు. దీని ప్రారంభోత్సవానికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తున్న అతని బంధువులు ఇటీవల పకీరుపాలెం వచ్చారు. ఆదివారం కావటంతో ఆరుగురుకు కలిసి సముద్రానికి వెళ్లారు. అక్కడ సముద్ర స్నానం చేస్తుండగా సాగరంలో ఏర్పడిన ప్రమాదకరమైన కడసరి కారణంగా అన్నాచెల్లెళ్లు గల్లంతయ్యారు. వాతావరణ మార్పులు ఏర్పడినప్పుడు ఇటువంటి ప్రమాదకరమైన కడసరిలు ఏర్పడతాయి. ఆ సమయంలో ఆ ప్రాంతంలోకి సముద్రస్నానాలకు వెళ్లకూడదని దీనిలో చిక్కుకుంటే గజఈతగాళ్లైనా గల్లంతవడం ఖాయమని.. అయితే సమయస్ఫూర్తితో మెలిగితే ప్రాణాలు కాపాడుకోవచ్చని మెరైన్ పోలీసులు వివరించారు. కాగా అన్న అమాద్ గల్లంతయిన విషయాన్ని మొదట ఎవరూ గమనించలేదు. అయితే అమల్‌ను తీరంలోని మత్స్యకారులు గమనించి వెంటనే అప్రమత్తమై ఒడ్డుకు చేర్చారు.

సముద్రపు నీరు తాగటంతో అపస్మారక స్థితిలో ఉన్న బాలికను 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అమల్ పరిస్థితి బాగానే ఉందని తెలిసింది. అమాద్‌ను వెతికేందుకు మెరైన్ పోలీసులు గాలం సహాయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. రామాయపట్నం మెరైన్ సీఐ ఆర్ఎస్ కిషోర్‌కుమార్, స్థానిక ఎస్సై షేక్ ఫిరోజ్ ఫాతిమా సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ఆచూకీ లభించేవరకు గాలింపు చర్యలు చేపట్టాలని కిషోర్‌కుమార్ సిబ్బందికి సూచించారు. అమాద్ ప్రైవేటు స్కూలులో 9వ తరగతి చదువుతుండగా, అమల్ 8వ తరగతి చదువుతోంది. అబ్దుల్ అమీద్‌కు 5 గురు కుమార్తెలు కాగా.. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. రామాయపట్నం మెరైన్ ఎస్సై పి. ఈశ్వరయ్య, మెరైన్ ఏఎస్సై సీహెచ్‌వీ మురళి, సిబ్బంది వెంకట్రావు, హరిబాబు పాల్గొన్నారు.


పాకల తీరం వద్ద పరిస్థితి సమీక్షిస్తున్న ఎస్పై షేక్ ఫిరోజ్ ఫాతిమా


షేక్ అబ్దుల్ అమాద్ (ఫైల్)


చికిత్స పొందుతున్న షేక్ అబ్దుల్ అమల్


కుమారుడు అమాద్ ఆచూకీ కోసం తీరం వద్ద ఎదురుచూస్తున్న తండ్రి

గెలుపే లక్ష్యంగా గృహ సారథుల ఎంపిక


గృహ సారథుల ఎంపికపై సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- 30 నాటికి నియోజకవర్గంలో సారథుల ఎంపిక పూర్తి
- ఎంపిక సమీక్షలో జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించటమే లక్ష్యంగా గృహ సారథులను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. ఆదివారం చీమకుర్తిలోని బూచేపల్లి కార్యాలయంలో అర్బన్, రూరల్ పరిధిలోని సచివాలయాల ఆధారంగా పనిచేస్తున్న ఒక్కో వలంటీర్ ఏరియాలో ఇద్దరు చొప్పున గృహ సారథుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ కన్వీనర్ల సమక్షంలో గ్రామాలు, అర్బన్‌లోని వార్డుల వారీగా ఆయా ప్రాంతాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ల సూచనల మేరకు గృహ సారథులను ఎంపిక చేశారు. వీరంతా స్థానిక సచివాలయాల కన్వీనర్లతో సమన్వయంగా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవడానికి కృషి చేయాలని బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. గత మూడున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకొని అర్హత కలిగిన వారికి రాకుంటే గుర్తించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, అర్బన్ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం కప్ బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన పురుషుల జట్టుతో అసోసియేషన్ సభ్యులు, పీడీలు


స్త్రీల జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీ సీఎం కప్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఎంపికైన జట్లు త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని అసోసియేషన్ సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ కంచర్ల రామయ్య, అసోసియేషన్ సభ్యులు సయ్యద్ జిలానీ, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసరావు, పొన్నలూరు పీడీ చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుషుల జట్టు : సీహెచ్ హేమంత్, జి.హరికృష్ణ, ఎం.సందీప్, టి.మోహన్‌చంద్, కె.వెంకటేష్, టి.విష్ణువర్ధన్, జె.జోషఫ్, కె.యేసుబాబు(కందుకూరు టీఆర్ఆర్ కళాశాల), ఆర్.గణేష్, డి.హేమంత్, పి.పవన్‌కుమార్‌రెడ్డి(దర్శి), జి.మన్మధరావు(పొన్నలూరు).

స్త్రీల జట్టు : కె.అశ్విని, పి.సుష్మగాయత్రి, కౌసల్య, పి.శాంతి, డి.హరిత, కె.స్రవంతి, ఎం.కల్పన(టీఆర్ఆర్ జూనియర్ కళాశాల), సీహెచ్.వైష్ణవి, డి.యామిని(పొన్నలూరు), కె.చిట్టెమ్మ, కె.వర్షిణి, మంజూష(కేజీబీవీ, మొగుళ్లూరు).

బాలుడి అనుమానాస్పద మృతి

అద్దంకి రూరల్: ఆడుతుపాడుతూ ఉండాల్సిన మూడేళ్ల బాలుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఈఘటన పట్టణంలోని స్థానిక గరటయ్య కాలనిలో చోటుచేసుకుంది. తల్లి వల్లెపు తిరుతమ్మ, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామానికి చెందిన తిరుపతమ్మకు అద్దంకి పట్టణంలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న వల్లెపు శ్రీనాథ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లైన కొత్తలో వీరి కాపురం సజావుగానే ఉంది. కొన్నాళ్లకు బాలుడు హేమంత్ (3) పుట్టాడు. అప్పటినుంచి శ్రీనాథ్ భార్యపై అనుమానం పెంచుకుని తరచూ వేధిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో తిరుపతమ్మ తన కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లి మూడేళ్ల నుంచి అక్కడే ఉంటోంది. ఇటీవల మూడు నెలల క్రితం పెద్దమనుషులతో నచ్చచెప్పించి తిరుపతమ్మను కాపురానికి పంపించారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బాలుడు హేమంత్‌కు జ్వరం రావటంతో తండ్రి శ్రీనాథ్ స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చూపించి మందులు తీసుకుని వచ్చి వేశాడు. తెల్లవారి ఆదివారం తండ్రి పనికి వెళ్లాడు. బాలుడికి నోరువెంటనుంచి నురగలు రావటంతో భయంతో తిరుపతమ్మ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లింది. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో తనభర్తే బాబును చంపేశాడని తిరుపతమ్మ ఆరోపిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న తిరుపతమ్మ బంధువులు వచ్చి శ్రీనాథ్ అతని తల్లి వెంకాయమ్మపై దాడి చేశారు. గాయాలవటంతో వెంకాయమ్మ, శ్రీనాథ్ చికిత్స పొందుతున్నారు. తన బిడ్డను తాను ఎలా చంపుకుంటానని తండ్రి శ్రీనాథ్ వాపోతున్నాడు. వైద్యశాలకు వచ్చిన ఎస్సై ఆదిలక్ష్మి వివరాలు సేకరించి కేసు నమోదుతో దర్యాప్తు సాగించనున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని రైతు దుర్మరణం


మృతి చెందిన రాజయ్య

బల్లికురవ: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తూ రోడ్డు దాటుతున్న రైతును కారు ఢీకొట్టటంతో అక్కడిక్కడే చనిపోయాడు. ఈఘటన ఆదివారం మేదరమెట్ల–నార్కెట్ పల్లి నామ్ రహదారిలోని మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామ సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలోని సుజాతా నగర్ కాలనీకి చెందిన మాచపోగు రాజయ్య (52) తనకున్న కొద్దిపాటి పొలానికి తోడు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, కూరగాయాల సాగు చేపట్టాడు. పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్తుండగా అద్దంకి నుంచి నార్కెట్‌పల్లి వైపు వేగంగా వెళ్తున్న ఏపీ 39 ఈటీ 3786 నంబర్ గల కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. కారు వేగానికి రాజయ్య రోడ్డు మార్జిన్‌లోకి రాయిపై పడటంతో తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రామకోటమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు దేవసత్యం ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ నరసింహ కేసు నమోదు దర్యాప్తు చేశారు. అనంతరం కారును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాజయ్య భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.